# నా స్వప్నము

శ్రీమతి పాకల రాజామణిగారు

ఇట్టి కలలు జాగ్రదవస్థ యందుకూడ పెక్కుమంది సోదరీమణులకు వచ్చుచుండ వలయును. అయ్యు,నవి కలలువలెనే మరుక్షణముననే మరువబడుచున్నవి. అందు చేతనే అట్టి కలలు ఎప్పటికి రాకుండెడి అవసరము అంతరించలేదు. కనులు తెరచి కార్య సాధనకు గడంగుచో నిట్టి యవసరము లంతరించ గలవు.

రాత్రి తొమ్మిదిగంటలప్పుడు మావదిన నేను క్రిందవసారాలో కూర్చొని మేము గతదినము చూచివచ్చిన అమరజ్యోతి సినిమానుగురించి మాటలాడుచుంటిమి. అందు సౌధామిని భర్తవలనపడుకష్టములు, వానికి న్యాయచట్టములో యుపశాంతి లేకుండుట, యామెవిసిగి పురుషులపైననే కత్తిగట్టుట మొదలగు సంగతులను గురించి వర్ణించి మావదిన చెప్పుచుండెను. ఇంతలో యామె భర్తరాగానే యామె లేచిపోయెను. నేనును పడకగదిలోనికి వచ్చితిని. మావారు పడకకుర్చీపై కూర్చొని యాఫీసుకాగితములు చూచుచుండిరి. చిన్నపోయిన నా మొహముచూచి 'యేమట్లావున్నా'వన్నారు. నేను "యేమండీ! మళ్లీ అమరజ్యోతికి రేపు తీసుకువెళ్లరూ' అన్నాను. వారు నవ్వుతూ 'ఇదా నీవు అట్లావుండడానికి కారణం సరే లే రేపువెళ్తాము. నీకు నిద్రవచ్చేటట్లుంది. నాకు పనిచాలావుంది. నీవు పండుకో. నేను వసారాలో పని చూచుకొంటూ''నని దీప మార్పి వారు వసారాలో కూర్చున్నారు. నేను మంచముమీద పండుకొంటిని. వెంటనే నిద్రపట్టినది. ఎంతసేపైనదో మావారు "యే మిలాకలవరిస్తున్నా"వని తట్టి లేపినారు. కళ్లుతెరచి అబ్బా! కలానిజమా" అని తెల్లబోయాను. "ఏమికల వచ్చిందేమి'' అన్నారు.

మన వీధిలో జయధ్వానులు పాటలు వినబడుతూయుంటే యేదో యూరేగింపు వస్తూయున్నదని చూడబోయాను. ముప్పైమంది స్త్రీలు నడివయస్సువారు, యింకా పెద్దవారు, విధవలు, పుణ్యస్త్రీలు, కాషాయవస్త్రములు కట్టుకొని ఆరువరసలు దీరి భక్తిరసప్రధానములగు కీర్తనలు పాడుచు జయధ్వానులుచేయుచు పోవుచుండిరి. మొదటివరుసవారు దేశమాతపటము క్రింద వందేమాతరం అను అక్షరములు వ్రాసిన పటమును, అట్టలపైన దీనులగు భారత సోదరీమణుల యార్తధ్వని యాలకింపుడు. హిందూసుందరులకు తగిన న్యాయముదయచేయుడు. మీ స్త్రీల నధఃపతితులను జేయకుడు. భారతీయ సోదరులారా! ధర్మము విచారింపుడు. సత్యమేవజయతి" యను వాక్యములను పెద్ద యక్షరములతో వ్రాసి యొక్కొక్కవరుస వారొక్కొక్క యట్టపట్టుకొని పోవుచుండిరి. కొంతదూరము పోగానే "యేమి యీయల్లరి యెక్కడికిట్లు పోవుచున్నారని'' పోలీసువారడ్డగించిరి.

అందు నాయకురాలగు స్త్రీ "అయ్యా! మేమేమీ అల్లరిచేయడములేదు. స్వరాజ్యముకొరకు గవర్నమెంటువారిని గోలచెయ్యడములేదు. కొద్దిదినాలలో శాసనసభ కూడనున్నది. కొన్ని నూతనచట్టములను స్త్రీలకొరకు నిర్మిస్తారని తెలిసి మాకష్టాలన్నీ వారికి విన్నవించి యందు కనువగు న్యాయచట్టములను నిర్మింప ప్రార్థింపబోవుచుంటి" మనెను. "అదంతా మాకు తెలియదు. ప్రభుత్వమువారి యనుమతి పొందనిదే మీరు ముందుకు పోగూడ"దని సార్జంటు అడ్డుపెట్టెను. "సరే మేమిక్కడేకూర్చుంటా" మని రోడ్డుప్రక్కన వారందరూ కూర్చుండిరి. కొంతసేపటికి పోలీసు యినస్పెక్టరువచ్చి వారింపజూచెను. కాని వారు వినలేదు. "మీ కష్టములేవో నాతో చెప్పు"డని యాయధికారి యడిగెను. "మీతో చెప్పము చట్టసభాధ్యక్షులతోనే జెప్పెద"మనిరి. "ఎందుకీ వృథాశ్రమ. ఎన్నివేల సంవత్సరాలనుండో నడుస్తూవున్న న్యాయశాసనాలని మీరు దిద్దగలరా? మీకు శాసనసభాప్రవేశముం డదుగాని కారాగృహావేశము కలుగును పొండని" యధికారనెను. అందుకా స్త్రీలు "అయ్యా! ఎప్పటికి మాకు న్యాయము కలుగునో అంతవరకు ప్రయత్నిస్తాము. న్యాయము కలుగకపోయిన యిల్లే చచ్చి పోయెదము. మా ప్రాణదానమువలననైన మాతోడి సోదరీమణులకు మేలుకలుగునేమో" యని దృఢముగా పలికిరి.

కొంతసేపటికి ప్రభుత్వమువారి యనుమతి బడసివారందరూ శాసనసభా ప్రవేశమొనర్చి యధ్యక్షునకభివాదన మొనర్చిరి. అధ్యక్షుడు వారిని కూర్చుండ నియమించి సోదరీమణులారా! మీకష్టములేమో చెప్పుకొందురా? యని యడిగెను. అదుకా సంఘ నాయకురాలొకపాతికేండ్లస్త్రీని లేచి యామె కష్టమును వివరింపకోరెను. ఆస్త్రీ "మహాశయులారా! నాభర్త నాయందు విరక్తుడై నన్ను కష్టపెట్టుచు వేరొకస్త్రీని ప్రేమించి యింటియందే యామెతో సౌఖ్యపడుచుండెను. భర్త పరస్త్రీని ప్రేమించుటే భార్యయు సహించలేదు. పైగా తన్నొల్లక యవమానించుచున్న యెవతె సహించగలదో యాలోచించుడు. కొన్నిదినములోర్చితిని. కడకు భరింపలేక యిల్లు వీడిపోదలచి నాభర్తను జీవనాంశమడిగితిని. ఇవ్వను పొమ్మనెను. నన్ను పోషించుటకు నాతలిదండ్రులు లేరు. నాకేదిగతి? న్యాయాలయములో వ్యాజ్యముతేగా నాభర్త నేను పొమ్మనలేదు గనుక జీవనాంశమివ్వను యింటనున్న పోషింతుననెను. నేనాకష్టము భరింపలేనని మొరబెట్టుకొంటిని. న్యాయాధిపులు 'అమ్మా హిందూ న్యాయచట్టములు నీకు వ్యతిరేకముగ నున్నవి. నీభర్త పొమ్మననిదే నీకు మనోవర్తిరాజాలదు. నేనేమిచేయగల'ననెను. భిక్షమెత్తియైన జీవించదలచి భర్తనువిడచి వచ్చితిని. వింటిరానాకష్టదశ" యని యాస్త్రీ మొగముపైన చెరగువేసుకొని యేడ్వజొచ్చెను. ఇంకొకస్త్రీ లేచి "సోదరులారా! నాభర్త నాయందయిష్టుడై నన్నింటినుండి

తరిమివేసెను. నాకు నాభర్తయందు ప్రేమ యధికము.- ఏకష్టమైన బడుచు యతని యొద్దనే యుండగోరితిని. వారొప్పుకొన లేదు. నాకు జీవించుటకు కొంత ధనమిచ్చెద ననిరి. నాకు ధనమువలదు మీ సన్నిధానమే కావలెనని కోరితిని. కాని న్యాయాలయములో న్యాయాధిపతులు నాభర్త యభీష్టమే స్థిరపరచిరి. న్యాయచట్టము నా కనుకూలించదట. భర్తృసన్నిధానము లభింపనప్పుడు తుచ్ఛధనము నాకువలదని తృణీకరించితిని. వింటిరా నాదీనచరిత"మని యామె కన్నీరు కాల్వలుగట్ట చెప్పెను. ఇంకొకస్త్రీలేచి "మహాత్ములారా! నాకిద్దరు బిడ్డలు. నాభర్త యత్తగారు నన్ను పెట్టరాని తిప్పలుబెట్టి బిడ్డలనివ్వక యింటినుండి తరిమివేసిరి. నాయందు లేనిదోషముల నారోపించి మనోవర్తి నివ్వమనిరి. కడకు బిడ్డలను విడువలేక పనికత్తెవలె యింటనుందు నంటిని. ఉండనిచ్చిరి కాదు. న్యాయాధిపతులువారి కనుకూలముగా తీర్పుచెప్పిరి. చట్టము లట్లున్నవట. కన్నబిడ్డలనుజూచి కొంత కష్టము మరతుమన్న వారిని జూచుటే కరవైపోయినది. ఈకడుపుతీపి నెట్లు మాన్పుకొనగల"నని గోడుగోడున యేడ్వదొడగెను. ఇంకొక విధవస్త్రీ లేచి "తండ్రులారా! నా పతిగతించునప్పుడు వారియాస్థి సమిష్టిగానుండెను. అది పిత్రార్జితముకాదు. మా మామగారి సంపాద్యమే. మా మరదులు, బావలు నాకు కొంత జీవనాధారమైన యివ్వమనిరి. వారింట పనికత్తెవలె వారి యడుగులకు మడుగులొత్తుచున్న యింతయన్నము పెట్టెదమనిరి. పోనీ నాతండ్రి ధనములో కొంత యివ్వమని నా సోదరుని కోరితిని. అతడూ యట్లే చెప్పెను. ఒక తలిదండ్రుల గర్భముల బుట్టినప్పటికి స్త్రీనగుట నాతండ్రి యాస్తిలో కొంతైన యనుభవింప నాకు వీలులేదట. నే నభిమాన గ్రస్థను. వారిండ్లలో హీనపు బ్రతుకు బ్రతుకలేక వ్యాజ్యముతేగా న్యాయాధిపులు వారిప్రక్కనే తీర్పుచెప్పిరి. వింటిరా న్యాయమ' నెను. అంత నాయకురాలు లేచి "ఆర్యులారా! మన న్యాయచట్టములు స్త్రీల కెంత విరుద్ధములుగ నున్నవో చూచితిరా. ఇందువలన యెందరు యువతులు పడరాని కష్టము లనుభవించుచున్నారో. ఇట్టివారింకా యెందరున్నారో. ఎందరు ప్రాణత్యాగములు చేసికొనిరో. ఎందరు శల్యావశిష్టులై కృశించుచున్నారో. భారత సోదరులారా! అనాధలగు మీ సోదరీమణుల కష్టములదీర్ప ప్రయత్నింపరా? వారి నుద్ధరింప యనువగు చట్టముల నిర్మింపరా? మీ సోదరీమణులిట్లు కృశింపుచుండ మీ దేశ మెట్లు తలయెత్తగలదు. కలకంఠి కన్నీరొలికిన సిరియింటనుండ నొల్లదని మన పెద్దలు చెప్పలేదా? ఇందరు స్త్రీలిట్లు దారిలేక యల్లాడు కన్నీటి కాల్వలతో దినములు గడుపుచుండ మీకు శ్రేయస్సెట్లు చేకూరును? మన దేశము సంపదతో యెట్లు తులతూగును? ఇకనైన మా మొరవిని మా కనుకూలమగు నుట్టములు నిర్మించు"డని నమస్కరించెను. అంత యధ్యక్షుడులేచి 'సోదరీ

మణులారా! మీ కష్టములువిన్న యెట్టి రాతి హృదయమైన కరిగిపోవును. మీకు కొంత ధనమిత్తుము. మీలో కొంతమంది యొక్క సంఘముగా యేర్పరచుకొని కొన్ని కొన్ని ప్రదేశములకేగి స్త్రీల కష్టముల నన్నిటిని విచారించి ప్రణాళికలను తయారు జేసి కొనిరండు. వాటి కనుకూలించు విధముగా కొన్ని చట్టములను తయారుజేసి ప్రభుత్వమువారికి నివేదింతుము. ఎట్లైన మీ కష్టములను దీర్ప మా శక్తికొలది ప్రయత్నింతుము. ఇక రెండు మాసములకు శాసనసభ కూడును. ఈలోగా ప్రణాళిక నివేదించుడు" అనెను. అంత స్త్రీలందరులేచి "ఆర్యులారా! మీకు దయామయుడగు దేవుడు మేలుచేయుగాక. మీకు మా కృతజ్ఞతాభివందనములు" అని వారలకు నమస్కరించి యందరు చేతులెత్తి యేకకంఠమున భారతమాతకు జై. భారత సాధ్వీమణులకు జై "యని యరచిరి. నేనునూ వుద్రేకముతో జై యని కేకవేశాను. ఆ కేకే మీకు వినబడినది కావలయునని'' యన్నాను. మావారు పకపకనవ్వి "ఒకవేళ యటువంటి ఉద్యమము లేవదీసి అంతకాడికి మా పురుషులని రప్పిస్తారేమో మీ స్త్రీలు. మీరేమి సామాన్యులా" అన్నారు.

---


# జ్వరం అద్భుతంగా నివారణైంది

మిస్టర్ అలెక్స్ మిరాండా ఇలా వ్రాస్తున్నారు: "నాకు తీవ్రమైనజ్వరం తగిలింది. ఏలాగో నిమ్మళించింది. కాని వెంటనే మరలివచ్చింది. చాలా నీరసించిపోయాను; తినలేను; ఎపుడూ డోకులు; అంచేత మరింత బలహీనమైపోయాను. కొత్తబలమిస్తుందని డాక్టరు హార్లిక్సును సిఫార్సుచేశాడు. వాంతికాకుండా నిల్చిన మొదటిఆహారం అదే. త్వరగానే తేరుకున్నాను. అప్పటినుండి ఎంతో బలంగావుంటున్నా. తరువాత జ్వరము రాలేదు. నేను హార్లిక్సును మాయింట ఎవుడూ వుంచుకుంటాను.

మిస్టర్ అలెక్స్ మిరాండా, గోవా.

నేడే హార్లిక్స్ కొనండి—అంతటా దొరుకుతుంది.